

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 9 సంచిక : 23 పుష్పం : 48-50 20-8-2004

RAMANA BHASKARA

*TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE*

PAGES : 16

VOL : 9 ISSUE : 23

EDITOR
*P.S. RAMA RAJU*

EDITING
*P.H.V. SATYAVATHI*
(HYMA)

SUBSCRIPTION
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

ADDRESS
RAMANA BHASKARA
SRI RAMANAKSHETRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.

PUBLISHER
P.S. RAMARAJU
LAKSHMI
MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎ 08814 - 224589, 224689

PRINTER
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎ 08814 - 222438, 221260
94401-31188

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 03-05-04, పెదఅమిరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

యుద్ధాలలో జయం సాధించినవాడిని వీరుడు అంటారు. కాని మహావీరుడు అంటే పూర్ణంగా జీవలక్షణములను, మనస్సును జయించినవాడు. జైనమత స్థాపకుడు మహావీరుడు. యోగం దేనిని పొందమని చెపుతోందో ఆవస్తువును పొందినవాడు మహావీరుడు. ఇక్కడ వేంకటేశ్వరకళ్యాణం జరుగుతోంది. వేంకటేశ్వరుడుఅంటే సర్వదేవతాస్వరూపుడు, ఆయన కలియుగదైవం, మనం అర్చన చేయడానికి అనుకూలంగా వెలసిన అవతారం, మనలను తరింపచేయటానికి వచ్చిన అవతారం వేంకటేశ్వరుడు. మనం ఇంటిలోనికి వెళ్ళటానికి గుమ్మాలు ఉంటాయి. ఏ గుమ్మంలో నుండి వెళ్ళినా ఇంటిలోనికి ప్రవేశించవచ్చు. అలాగే మోక్షం అనే ఇంటిలోనికి వెళ్ళటానికి రామానుజుడు, శంకరాచార్యులు, మధ్వాచార్యులు గుమ్మాలను పెట్టారు. మనం ఏగుమ్మంలో నుండి ప్రవేశించినా అంటే వారు చెప్పిన ఏ మార్గంలో ప్రయాణించినా, విశ్వాసంతో ప్రయాణం చేస్తే మోక్షాన్ని పొందవచ్చు, బుద్ధుడు వాదాలు, వివాదాల జోలికిపోలేదు. తర్కంతో టైము పాడుచేసుకోవద్దు అని బుద్ధుడు చెప్పాడు. కాలం ఒక నదీ ప్రవాహంలాంటిది. మనం ఆప్రవాహంలో కొట్టుకొనిపోతున్నాము. ఈ దేహం ఏదోరోజు మరణిస్తుంది, చనిపోయేరోజు మనకు తెలియదు. దేహం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోండి అని చెపుతారు కదా అందుచేత ఈ దేహం ఉండగానే దేహాన్ని, మనస్సును ఉపయోగించుకొని నీవు ఈ భూమి మీదకు ఎందుకు వచ్చావో ఆపని చూసుకో, దేహానికి మరణం రాకముందే

**ఈ సంచికలో......** **సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు**

03-05-04 పెదఅమిరం ........ 1
25-07-04 పాలుపేట ........ 7
01-08-04 అయిభీమవరం ........ 10



నిర్వాణస్థితిని పొందటానికి ప్రయత్నంచెయ్యి అని బుద్ధుడు చెప్పాడు. మనం నేను, నేను అంటున్నాము కదా. ఈ నేను దేహంతో, మనస్సుతో తాదాప్యంపొందుతోంది. ఈ దేహము, మనస్సు, బుద్ధి, ఇంద్రియాలు ఇవిఅన్నీ ప్రకృతివిషయాలే. వీటితో ఇసుమంతయు సంబంధంలేకుండా మనహృదయంలో ఒక నిజం ఉంది. అదే ఆత్మ, అదే బ్రహ్మం. దానికి చావులేదు, పుట్టుకలేదు, దానికి దేశకాలములతో సంబంధంలేదు, బంధమోక్షములతో సంబంధంలేదు. దానిని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ప్రయత్నంచేయాలి. దేహబుద్ధిని పెంచేది అది విద్యకాదు అది అవిద్య. దేహబుద్ధిని తగ్గించేది మాత్రమే నిజమైనవిద్య అన్నాడు ప్రహ్లాదుడు. చదువులలోని మర్మమును తెలుసుకొని చదువు అన్నాడు ప్రహ్లాదుడు. ఇప్పడు మనం చీకటిలో ఉన్నాము, చనిపోయిన తరువాత కూడా చీకటిలోనే ఉంటాము. ఎంతకాలం అయితే దేహగతమైన బుద్ధి ఉంటుందో అంతకాలం ఈజన్మలోనేకాదు, రాబోయేజన్మలో కూడా మనజీవితాలు చీకటిమయం. మనంచేసే కర్మలకు ఫలితం ఉంది. మనం ఉచితమైన పనులు చేస్తే దానివలన పుణ్యంవస్తుంది, అది సుఖరూపంలో ఖర్చుఅయిపోతుంది. మనం ఉచితంకాని పనులు చేస్తేదాని వలన పాపం వస్తుంది, అది దుఃఖరూపంలో ఖర్చుఅయిపోతుంది. ఒక కాలంలో చేస్తావు, ఇంకోకాలంలో అనుభవిస్తావు, ఇవి అన్నీ వ్యవహారికసత్యాలు. ఈకాలం ఎంతనిజమో నీవు అనుభవించేది కూడా అంతేనిజం. ఏదో చేయటం వలన వచ్చే ఆనందం కాదు, స్వతంత్రమైన ఆనందం నీ హృదయంలో ఉంది. ఈజననమరణాలకు, సుఖదుఃఖాలకు, దేశకాలములకు ఈప్రకృతివిషయాలకు అతీతంగా ఒక సద్వస్తువు నీహృదయంలో ఉంది. దాని స్వరూపమే ఆనందం. ఆత్మవిద్యలేకుండా అదినీకు అనుభవంలోనికి రాదు. అందుచేత నీ చూపు అక్కడపెట్టు అంటున్నారు భగవాన్. నీవు ఈలోకంలోనికి ఎందుకు వచ్చావో ఆపనిమర్చిపోయావు. తియ్యటి మామిడిపండు నీ హృదయంలో ఉంది. దానిని తినటం మానివేసి ఆకులు, రొబ్బలు లెక్కపెడుతున్నావు. ఈ ప్రపంచం ఎంతకాలం నుండి ఉంది, వారు మంచివారు, వీరుచెడ్డవారు ఇలాఏవో పిచ్చిగొడవలను నెత్తిమీద వేసుకొని తిరుగుతున్నావు. ఈలోగా కాలంవస్తుంది చచ్చి ఊరుకొంటావు అన్నారు. నీకు ఎక్కడయితే ఇష్టం ఉందో అక్కడ మమకారం ఉంటుంది, ఎక్కడయితే అయిష్టం ఉందో అక్కడ ద్వేషంఉంటుంది. వీటివలన మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది. ఇలాస్నేహాలతో, విరోధాలతో కాలాన్ని పాడుచేసుకొంటున్నావు. ఇంక జపం ఏమిచేస్తావు, ధ్యానం ఏమిచేస్తావు, ఇంక మామిడిపండు ఎప్పడుతింటావు అంటున్నారు పరమహంస. సమానబుద్ధిని అలవర్చుకో అని గీతలో పరమాత్మచెప్పాడు. ఎవరి పూర్వజన్మ సంస్కారాన్ని బట్టి వారు ఉంటారు. వారి గొడవనీకు ఎందుకు? నీ హృదయంలో మటుకు అందరిపట్ల సమానబుద్ధిని కలిగిఉండు అని భగవంతుడు చెపుతున్నాడు. ఎవడైతే మహాభక్తుడో వాడు మహాజ్ఞాని అయిఉంటాడు. ఎవడైతే మహాజ్ఞానో వాడు మహాభక్తుడు అయిఉంటాడు.

యోగం అంటే చప్పిడి కూరలు తినటం కాదు, ఆసనాలు వేయటంకాదు. ఆకారములతో, వికారములతో దేనితోనూ సంబంధంలేకుండా ఒక సత్యవస్తువు నీ హృదయంలో ఉంది. లోపలఉన్న సత్యవస్తువుతో ఏదైతే నిన్ను అనుసంధానం చేస్తుందో అదే యోగం, మనం ఏదిగా ఉన్నామో దానిలో మనలను ఐక్యపరచేదే యోగం. జయాపజయాలు అనేవి నీ తెలివిమీద ఆధారపడిలేవు పూర్వజన్మలో నీవు చేసిన కర్మలయొక్క ఫలితాన్నిబట్టి ఉంటుంది. కర్మఫలితంనీకు అనుకూలంగా ఉన్నప్పుడు జయంకలుగుతుంది, అనుకూలంగా లేకపోతే అపజయం కలుగుతుంది. దీనికి నీహృదయంలో ఉన్న సత్యానికి సంబంధంలేదు. కాలప్రవాహంలో జయంపోతుంది, అపజయంకూడాపోతుంది, కాలప్రవాహంలో మన శరీరమేపోతోంది కదా. ఇవి అన్నీ ప్రకృతివిషయాలు, ఈగొడవలు వద్దు, లోపలఉన్న సత్యాన్ని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ప్రయత్నం చెయ్యి. మనకు నేను అనేటప్పటికి దేహం గుర్తుకువస్తుంది, మనస్సు గుర్తుకు వస్తోంది. మీకు దేహంతో తాదాప్యం లేకపోతే, మనస్సుతో తాదాప్యంలేకపోతే మిమ్మల్ని ఎవరైనా విమర్శించినా మీకు దుఃఖంరాదు, మిమ్మల్ని ఎవరైనాపొగిడినా మీకు సంతోషంరాదు. దేహంతోఉన్న తాదాప్యాన్ని, మనస్సుతో ఉన్న తాదాప్యాన్ని తొలగించుకో. తొలగించుకోవలసింది తొలగించుకొంటే అప్పుడు నీహృదయంలో ఉన్ననిజం తానుగా నీకు వ్యక్తమవుతుంది.

నీ హృదయంలో సత్యం ఉంది. అది ఉండటం వలననేఅన్నీ జరుగుతున్నాయి. అది సర్వసాక్షి, దానికి తెలియకుండా చేసేది ఏమీలేదు, అన్నీదానికి తెలుసు. లోపల ఉన్న వస్తువు సమానంగా ఉంది అందుచేత నీవు సమానబుద్ధిని ప్రాక్టీసు చెయ్యి. మనుషులు రకరకాలుగా ఉంటారు. కాని అందరి హృదయాలలో ఈశ్వరుడు ఉన్నాడు ఆయన సమానంగా ఉన్నాడు. నీవు సమానబుద్ధిని ప్రాక్టీసు చేస్తే ఆయన తెలియబడతాడు. మీకు కష్టం కలిగించే మాట ఎవరైనా అంటే వెంటనే మీకు వికారం వచ్చేస్తుంది, మూతి బిడాయించేస్తారు. మీరు భక్తులా? మీకు జ్ఞానమా? అంటున్నారు. ఇవన్నీ మీరు సహించగలగాలి. ఇప్పుడు మనశరీరాలు బ్రతికిఉన్నాయి కదా. ఈ శరీరం చనిపోయేవరకు మనకు ఈప్రపంచంతో, సమాజంతో అనుబంధం తప్పదు. ఇంట్లో వారితో మాట్లాడటం తప్పదు. మనిషిఅయ్యాక ఏదో సంబంధం తప్పదుకదా. ఇక్కడ భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే ప్రపంచంతో నీకు ఉన్న సంబంధం రజోగుణంగా ఉండకూడదు, తమోగుణంగా ఉండకూడదు, సాత్వికంగా ఉండాలి. సత్వగుణంకూడా నిజంకాదుగాని అదినీహృదయంలో ఉన్న నిజానికి దారిచూపిస్తుంది. అజ్ఞానం పెరగకుండా ఉండాలంటే ఆఫీసులో వ్యవహారాలలో ఎలా ఉంటాయో ఇంటిదగ్గర సొంతవ్యవహారాలలో కూడా అలాగ ఉండాలి అంటున్నారు భగవాన్. ఇన్కమ్‌టాక్సు ఆఫీసర్ ఉన్నాడు అనుకోండి. ఆఫీసులో ఒకరోజు టాక్సు ఎక్కువ వసూలు అవ్వవచ్చు ఒక రోజు తక్కువ అవ్వవచ్చు, దానికి వాడిలో ఏమీ వికారం ఉండదు అలాగ మీఇంటిదగ్గర వ్యవహారాలలో కూడా వికారం లేకుండా





ఉండాలి. కాని మనం ఇంట్లోగొడవలకు ఒకరకంగా, ఆఫీసులో గొడవలకు ఒకరకంగా ఉంటాము. మనకు ఇల్లు ఉన్నా, పొలం ఉన్నా వాటికి మనం కాపలాదారులము మాత్రమే. చనిపోయిన తరువాత ఇల్లు, పొలం మనకూడా రావు. మనం వాటికి కాపలాదారులమే కాని ఓనర్స్ మాత్రంకాదు. ఇదంతా భగవంతుడిదే. మనం పాలేరుతనం చేస్తున్నాము అని మర్చిపోయి మనమే ఓనర్స్ అనుకొంటున్నాము. ఎలక్షన్‌టైమ్‌లో నాయకులు వచ్చి మీకు సేవచేస్తాము అని చెపుతారు. నెగ్గినతరువాత వారు ఏమనుకొంటారు అంటే మనందరికివాడు యజమాని అనుకొంటాడు, ఇదేమాయ. అందుచేతనే నామాయను ఎవడూ జయించలేడు అని కృష్ణుడు చెప్పాడు. ఒక మనిషి మీద నీకు మనస్సులో అయిష్టం ఉంది అనుకో నువ్వు వెంటనే నోటితో చెప్పేయకూడదు, అలా చెప్పటం వలన అది పెరిగిపోతుంది. నోటితో చెప్పకుండా ఉంటే అది నెమ్మదిగా తగ్గిపోతుంది. స్నేహము, సంతోషం, దయ ఇవిఅన్నీ జ్ఞానికి సహజంగా ఉంటాయి. జ్ఞానిలో ఏవైతే సహజంగా ఉన్నాయో వాటిని మనం నేర్చుకోవాలి. నిన్ను నీవు చూసుకొని లోకాన్ని చూస్తే నువ్వు మాయలో పడవు అన్నారు భగవాన్. నీహృదయంలో ఉన్న వస్తువును అనుభవంలోనికి తెచ్చుకొని తరువాత లోకాన్ని చూస్తే అదే అంతటా కనిపిస్తుంది, అప్పుడు ద్వితీయంలేదు, అంతాతానే. కుండ కూడా నిజమే కాని కుండ కుండగా నిజంకాదు, మట్టిగా నిజం అన్నారు ఆచార్యులవారు కుండలో ఉన్న మట్టిని తీసేస్తే కుండ ఎక్కడఉంది. అందుచేత కుండను కుండగా చూడకు, మట్టిగాచూడు, అప్పుడు వికారం రాదు. అలాగే ఈ నామరూపములను ధరించింది బ్రహ్మమే. నామరూపములను మైనస్‌చేస్తే ఉన్నది బ్రహ్మమే. బ్రాహ్మీస్థితి పొందినవాడికి స్థిరమైనబుద్ధి కలుగుతుంది. నీవు ఇతరులకు ఏదైనా ఉపకారం చేసావు అనుకో, నీవు ఏదో చేసేసాను అనుకొంటున్నావు కాని అది అంతానీకే వచ్చేస్తుంది. ఇతరులకు నీవు ఏదైనా అపకారంచేసినా అదికూడ మరల నీకే వచ్చేస్తుంది. ఎందుచేతనంటే ఉన్నదంతా ఒక్కటే అన్నారు భగవాన్. నీవు చేసినదే నీకు వస్తుంది, నీవు చేయనది ఏదీనీకురాదు. కారు ఏక్సిడెంట్‌లో మా అబ్బాయి,కోడలు చనిపోయారు, వారి మిత్రులు బతికారు. నేను ఏమి పాపం చేసానుఅని నా కొడుకు, కోడలు చనిపోయారు అని ఒక అమ్మగారు అడుగుతున్నారు. మీకొడుకు, కోడలు చనిపోలేదు అనుకోండి వారి మిత్రులు చనిపోయారు అనుకోండి, మీకు ఇంత దుఃఖం వస్తుందా అని అడిగాను, రాదుఅని ఆవిడచెప్పారు అదే పాపం అన్నాను. మనలోపల పాపం ఉంది కాబట్టి అహంకారం, మమకారం వస్తోంది. మనంపాపరహితులం అనుకోండి, దోషరహితులం అనుకోండి అసలు అహంకారంలేదు, మమకారంలేదు. స్వపరభేదమే పాపం, భేదబుద్దే పాపం. లింకన్ ఎలక్షన్‌లో ఓడిపోయినప్పుడు ఆయనకు ఏమీ వికారం వచ్చేదికాదు. ఎలక్షన్‌లలో పోటీపడటం నాకు అలవాటు అయిపోయింది, ఓడించటం ప్రజలకు అలవాటు అయిపోయింది అనేవాడు. నాకు ఏదైనా పదవివస్తే వారికి ఉపకారం చేద్దామనుకొంటున్నాను, పదవిరాకుండా

వారుచేస్తే నాకు నష్టంఏమిటి అన్నాడు. ఆయన సమానబుద్ధిని ఎప్పడూ విడిచిపెట్టలేదు. మనసాధనకు వారు అడ్డువస్తున్నారు, వీరు అడ్డువస్తున్నారు అనుకొంటున్నాము కాని ఎవరూ అడ్డురావటం లేదు, మీ మనస్సే అలా చెపుతోంది. నీవు చేసిన మంచికి, చెడుకు ఒక క్రమపద్ధతిలో ఫలితంవస్తుంది, ఆగొడవలు వద్దు, లోపల ఉన్న ఆనందాన్ని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ప్రయత్నం చెయ్యి దేనిచేత అంతాచూడబడుతోందో అది ఒక్కటే నిజం కాని చూడబడేది మాత్రం నిజంకాదు. మనం కళ్ళ ద్వారామైకును చూస్తున్నాము అనుకోండి. అంటే మైకు కళ్ళచేత చూడబడుతోంది, కళ్ళు మనస్సుచేత చూడబడుతున్నాయి, మనస్సుకు చూసే శక్తి చైతన్యం నుండివస్తోంది. ఆచైతన్యాన్ని ఇప్పడే ఇక్కడే అనుభవంలోనికి తెచ్చుకోవాలి. ఏవస్తువు సహాయం వలన ఇవి అన్నీ చూడబడుతున్నాయో ఆ వస్తువును తెలుసుకొంటే నీకు మోక్షం కలుగుతుంది. దానికి లోపల అన్వేషణ కావాలి. ఈ మధ్యమేము సుఖంగా ఉన్నాము అని కొంతమంది చెపుతూఉంటారు, మాకు దుఃఖంవస్తోంది అని కొంతమంది అంటారు. మేము సుఖంగా ఉన్నాము లేకపోతే మేము దుఃఖంగా ఉన్నాము అనిచెప్పేది దొంగనేను. ఇది నిజంకాదు, ఇది అంతా అహంకారము కల్పించినదే. వీటి అన్నింటిని ఏదైతే కల్పిస్తోందో అందులో నుండి విడుదలపొందటమే మోక్షం. మనస్సు హృదయాభిముఖంగా ప్రయాణంచేయాలి. మనస్సు హృదయాభిముఖంగా ప్రయాణం చేస్తూఉంటే ఆత్మ తాలుక సుఖం, శాంతి తెలుస్తూ ఉంటుంది, అప్పడు మీ ఇంట్లో శత్రువులు ఉన్నా మీకు ఏమీ అనిపించదు, మీపట్ల ఎవరైనా అప్రియంగా ఉన్నట్లు మీ మనస్సుకు తెలుస్తూఉన్నా అది మిమ్మల్ని బాధపెట్టదు. జ్ఞానంపొందటం పెద్ద కష్టం ఏమీకాదు, మీరు కష్టం కష్టం అనుకొంటున్నారు. సూర్యుడు ఆకాశంలో ఉన్నాడు, ఆయన కనబడటానికి నీమొఖం అటు తిప్పితే సరిపోతుంది. హృదయంలో జ్ఞానం ఉంది, నీ మనస్సును అటు తిప్పితే చాలు అంత కంటే పెద్ద కష్టపడవద్దు అంటున్నారు భగవాన్.

ఈ ప్రపంచం ఉందా, లేదా అని ఒకరు భగవాన్‌నుఅడిగారు. భగవాన్ ఉందనిచెప్పలేదు, లేదుఅనిచెప్పలేదు, కనిపిస్తోంది అని చెప్పారు. కనిపించేది అంతానిజంకాదు అన్నారు. నిజం నీ హృదయంలో ఉంది. నీ మనస్సును ప్రపంచం వైపుకు తిప్పేబదులు, లోపలకు తిప్ప నీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. మనంచేసే సాధనలు అన్నీ రెండవ పక్షం, ఈశ్వరానుగ్రహం ముఖ్యం. మనం చేసేసాధనలు ఈశ్వరుని దయను సంపాదించి పెట్టేలాగ ఉండాలి . మనమాట, చేత, ఆలోచన ఈశ్వరుని దయను సంపాదించిపెట్టేలాగ ఉండాలి. ఈశ్వరుని దయలేకుండా మోక్షంరాదు. గురువు దయ ఉంటే ఆత్మసుఖం మన చేతికి అందుతూఉంటుంది. జ్ఞాని ఈశ్వరుడిలో ఉంటాడు, అందరిలోను ఈశ్వరుడినే చూస్తూఉంటాడు. ఇంక ఈనామరూపాలకు మోహపడే అవకాశమే లేదు.

మానవతా అనుబంధం లౌకికులలో ఏమి చూస్తాము, అది జ్ఞానులలో చూడాలి.



అరుణాచలం వచ్చిన కొత్తలో ఒకతను భగవాన్ మీద ఉమ్మివేసాడు. తరువాత కొంతకాలానికి అతనికి పశ్చాతాపం కలిగింది. భగవాన్‌దగ్గరకు వచ్చి నేనుపొరపాటు చేశాను అని చెప్పాడు. ఉమ్మివేసినప్పడు భగవాన్ ఎంత ఆప్యాయంగా చూసారో, నేను పొరపాటు చేశాను అని అతను వచ్చి చెప్పినప్పడు కూడా అంత ఆప్యాయంగా చూసారు, ఆచూపులో ఏమీ తేడాలేదు. అది మానవతాదృక్పధం. మానవతాదృక్పధం లేనివాడికి ఆత్మజ్ఞానం ఏమిటి? మీ శ్రేయస్సు కోరేవారు మిమ్మల్ని చిన్నమాట అంటే జీవితం పొడుగునా జ్ఞాపకం పెట్టుకొంటారు, ఇంక మీకు జ్ఞానం ఏమిటి? అంతసహనంలేనివారికి, అంత చిన్నమనస్సు ఉన్నవారికి, రజోగుణంతో తమోగుణంతో కాలిపోయేవారికి ఆత్మజ్ఞానం ఏమిటి? ఉపనిషత్‌లు చెప్పినా, ఏఋషిచెప్పినా, అవతారపురుషుడు చెప్పినా నువ్వు ఆత్మజ్ఞానం సంపాదించు అని చెపుతున్నారు. ఎందుకు అలా చెపుతున్నారు అంటే ఆత్మజ్ఞానంలోనే ఆనందం ఉంది, ఆత్మజ్ఞానంలో తప్పించి ఆనందం ఎక్కడాలేదు. ఒక వేళ ఉంది అని నీవు అనుకొంటే అది నీ అవిద్యకు గుర్తు, నీ అజ్ఞానానికి గుర్తు.

శివుడు కంటే విష్ణువు గొప్పవాడు, విష్ణువుకంటే శివుడు గొప్పవాడు, ఆదేవతలు గొప్పవారు, ఈదేవతలు గొప్పవారు అని ఇలా టైము పాడుచేసుకోవద్దు. మీకు ఏదేవుడు ఇష్టమయితే ఆ రూపాన్ని ధ్యానం చేసుకోండి, ఆనామాన్నిస్మరించుకోండి. దానివలన ఇంద్రియనిగ్రహం వస్తుంది, మనోనిగ్రహంవస్తుంది, మన నామరూపాలకు దూరమవుతాము, అజ్ఞానానికి దూరమవుతాము. మనం ధ్యానం చేయగాచేయగా చివరకు ధ్యానం చేసేవాడు సున్న అవ్వాలి మనం ఎవరిగురించి ధ్యానం చేస్తున్నామో వారి స్వరూపం మనంపొందాలి, అది ధ్యానం యొక్క ప్రయోజనం. జపం యొక్క ప్రయోజనం ఏమిటి అంటే ఇతర తలంపులు రాకుండా జపం మనలను కాపాడుతుంది. మనకు చేతనైతే ఉపకారం చేద్దాము, మంచిచేద్దాము. మంచిచేయలేకపోతే ఊరకవుందాము అంతేగాని అపకారం చెయ్యవద్దు. మానసికఆరోగ్యమే లేనప్పడు, మానసికస్థిరత్వం లేనప్పడు మనకు జ్ఞానం ఎలా కలుగుతుంది. మానసికస్థిరత్వం రావటంకోసం జపధ్యానములను మనపూర్వీకులు ఏర్పాటుచేసారు. మనం నడిచివెళ్ళేటప్పడు అడుగులు లెక్కపెట్టుకొంటామా. లేదు. అలాగే మీకు చేతనయినంతవరకు మంచిపనులు చేసుకొంటూ వెళ్ళు, లెక్కలు అనవసరం. ఆత్మవిద్యఎందుకు అంటే అజ్ఞానాన్ని సున్నచేసుకోవటానికి. అజ్ఞానం సున్నఅయితే గాని హృదయంలో ఉన్న నిజం మనకు దర్శనం కాదు. అది దర్శనం ఇస్తేగాని మనకు స్వేచ్ఛలేదు, ఆనందం లేదు, శాంతిలేదు. ఆనందం అనేది ప్రపంచంలో ఎక్కడాలేదు, అది నీహృదయంలోనే ఉంది కాని ఆత్మజ్ఞానం లేకుండా అది నీకు అందదు. అందుకే ఆత్మజ్ఞానం సంపాదించుకో, ఆనందంపొందుతావు అని భగవాన్ చెపుతున్నారు. ఏ జీవుడయితే అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడిచే ప్రేమించబడుతున్నాడో వాడికి మాత్రమే ఆత్మజ్ఞానం అనుగ్రహింపబడుతుంది.

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 25-07-04, పొలుపేట

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ప్రపంచంలో అనేక ఆకర్షణలు ఉంటాయి, అనేక ప్రలోభాలు ఉంటాయి. ఇందులోఏ ఆకర్షణకులోనైనా, ఏ ప్రలోభానికిలోనైనా మనకు ఆత్మజ్ఞానం కలుగదు. తాత్కాలికంగా ఏదో ప్రయోజనాలు దృష్టిలోపెట్టుకొని ఎవరైనా ఇతరులు మామతం లోనికి రండి అన్నా అలా ఎవరూ మతాలు మార్చుకోవద్దు. అసలు మతాన్ని మార్చుకోమని చెప్పేవాడు ఏ ఉద్దేశంతో మనలను మతాన్ని మార్చుకోమంటున్నాడో అనే ఆలోచన మీకు లేకపోతే మీరు కష్టాలలో పడతారు. ప్రతీ మనిషికి సొంతఆలోచన ఉండాలి. హిందూమతానికి సనాతనధర్మం అనిపేరు. మనం మోక్షం పొందటానికి, శాంతిని పొందటానికి, ఆనందాన్నిపొందటానికి ఉండవలసిన సామాగ్రిఅంతా హిందూమతంలో ఉంది. కాని దురదృష్టవశాత్తు మన పెద్దలు ఏమిచేస్తున్నారు అంటే దేవుడు కళ్యాణాలకు ప్రవచనాలు, పురాణాలు చెప్పించటం మానివేసి సినిమాలు, రికార్డింగ్ డాన్సులు పెడుతున్నారు. అసలు మామూలుగానే ఇంద్రియాలకు ప్రకోపం ఎక్కువగా ఉంటుంది. ఈడాన్సులు, సినిమాల వలన మనస్సులో ఉద్రేకాలు పెరుగుతాయి, శాంతిపోతుంది, అసలు జీవితలక్ష్యానికి దూరమయిపోతాము. ప్రకృతిలో ఇంద్రియాలను ఉద్రేకపరిచేగుణాలు ఉంటాయి, వాటిని తగ్గించుకోవటం మానివేసి, దేవుడిసన్నిధిలో ఇంద్రియాలను ఉద్రేకపరిచే డాన్సులు ఏమిటి? దేవుడి సమక్షంలో మనకు జ్ఞానమే ప్రధానం, శాంతే ప్రధానంగా ఉండాలి. మనం ధర్మాన్ని ఆచరించకుండా మనస్సు నశించదు. భగవంతుడు ఎలా జీవించమని చెప్పాడో అలా జీవిస్తే భగవంతుడి దయకు మనం పాత్రులవుతాము. వారికి మాత్రమే ఇంద్రియనిగ్రహం కలుగుతుంది, మనోనిగ్రహంకలుగుతుంది. మనలను రక్షించటానికి ఒక్క రామాయణం చాలు. రామానుగ్రహంపొందటానికి అనుగుణంగా మన జీవితవిధానం ఉండాలి. రాముడికి సుఖం వచ్చినా, దుఃఖం వచ్చినా ఒకలాగే ఉండేవాడు. రాముడు ఎలాజీవించాడో అలా మనంకూడా జీవించగలిగితే మనకు మనోనాశనం అవుతుంది. ధర్మానికి అనుగుణంగా మనంజీవిస్తే మనకు ఇహం ఉంటుంది, పరం ఉంటుంది అంటే ఇక్కడ సుఖపడతాము, మరణానంతరం అక్కడ సుఖపడతాము. ఎవడైతే ధర్మాన్ని రక్షిస్తున్నాడో వాడు ధర్మంచేత రక్షింపబడతాడు.

మనం ఏదైనా ఒకపనిచేస్తే ఆపని నిర్మలంగా ఉండాలి, కర్తృత్వం లేకుండా ఉండాలి, శాంతిగా చేసుకొంటూ వెళ్ళాలి, ఉద్రేకపడకూడదు. భగవంతుడు ఈ శరీరాన్ని ఆపనికోసం ఉపయోగించుకొంటున్నాడు అనుకోవాలి. అంతా భగవంతుడే అంటారు, కాని అసలు ఉన్నదే భగవంతుడు అనాలి, భగవంతుడు తప్పించి ఏమీలేదు. మీ పనులు శ్రద్దగా చేసుకోండి. మీకంటే ఎవరైనా బాగుంటే వారిని చూసి ద్వేషపడకండి, ద్వేషంకంటే విషం మెరుగు అనిశాస్త్రం చెప్పింది. విషం తాగితే ఆశరీరమేపోతుంది కాని ద్వేషం అలవాటు





అయితే అది అనేక నీచజన్మలకు కారణమవుతుంది. విషం కంటే ద్వేషం చెడ్డది అందుకే ద్వేషాన్ని త్యజించమని చెపుతున్నారు. మీకు ఏదైనా మంచిపని చేసేఅవకాశంవస్తే భగవంతుడు ఈ అవకాశాన్ని ఇచ్చాడు అనుకోండి, భగవంతుడు అవకాశం కలుగజెయ్యకపోతే మనం ఏపని చెయ్యలేము. మనకు తలంపు వలననే దుఃఖంవస్తుంది. అందుచేత మనం తలంపులలో నుండి విడుదలపొందాలి. మనోనాశనానికి నేను ఎవడను అనే విచారణామార్గాన్ని భగవాన్ చెప్పారు. విచారణ చేస్తున్నా తలంపులు ఆగటం లేదు అని అడుగుతున్నారు. భగవాన్ ఒకమాట చెప్పారు, ఆమాటే పట్టుకొని వ్రేలాడనక్కరలేదు, మనోనాశనానికి చాలా మార్గాలు ఉన్నాయి. ఈశ్వరుడిపట్ల పరిపూర్ణమైన విశ్వాసం ఉన్నప్పటికి మనస్సునశిస్తుంది. ఈశ్వరుడిపట్ల భక్తి కలిగి ఉండటం, ఆయన నామాన్ని నిరంతరం స్మరించటం వలన, ఆయన పాదాలను ఆశ్రయించటం వలనకూడా మనోనాశనమవుతుంది. బాబాగారు ఒకసారి మసీదులో కూర్చొన్నారు. అక్కడ ఎక్కువగా పాములు తిరుగుతూ ఉండేవి. ఒకపాము బాబావీపుమీదనుండి పాకుతూ ముందుకు వచ్చింది, ఆయన క్వైట్‌గా ఉన్నారు. అక్కడ కూర్చొన్నవారికి భయంవేసి లేచిపోయారు. మీరుకంగారు పడకండి, అది తులసివనంలో నుండి వచ్చింది, మరల ఆపాము అక్కడకే వెళ్ళిపోతుంది అని బాబాచెప్పారు. పాము నెమ్మదిగా తులసివనంలోనికి వెళ్ళిపోయింది. ఆపామును మేము కళ్ళతో చూస్తూఉంటేనే మాకు భయంకలుగుతోంది, అది మీ వంటిమీద పాకుతూ ఉన్నా మీకు భయం కలగటంలేదు ఏమిటి అని అక్కడ ఉన్న ఒక అమ్మగారు బాబాను అడిగారు. బాబాఏమి చెప్పారు అంటే దీనికి కారణం వేరుబుద్ధి అన్నారు. నీకు వేరుబుద్ధి ఉంది అందుచేత నీకు భయం కలుగుతోంది, వేరుబుద్ధి లేనప్పడు అసలు భయమేలేదు అన్నారు. నేను ఇక్కడ ఉండగానే పాము కరిచేస్తుందని మీకు భయం కలుగుతోంది. పాముకు కరవటమేనా పని ఇంకో పని లేదా అన్నారు బాబా. ఈశ్వరుడి పట్ల పరిపూర్ణమైన విశ్వాసం ఉంటే భయం కూడా అణిగిపోతుంది. దేహభావనలో నుండి కోరిక, కోపం, భయం వస్తాయి. ఆత్మభావనలో కోరికలేదు, కోపం లేదు, భయం లేదు. ఒకరోజు బాబాగారి దగ్గర భక్తులు కూర్చొని ఉన్నారు. ఒకడు భక్తులను గెంటుకొంటూ ముందుకు వచ్చి కూర్చొని నాకు బ్రహ్మజ్ఞానం కావాలి అని బాబాగారితో అంటున్నాడు. వాడిజేబులో 105 రూ॥లు ఉన్నాయి. బాబా అక్కడ వున్న ఒక అమ్మగారిని పిలిచి ఫలానావారి ఇంటికి వెళ్ళి బాబా 5 రూ॥లు ఇమ్మన్నారు, అని అడిగి పట్టుకొని రమ్మన్నాడు. ఎవరైతే ఇంటిదగ్గరలేరో వారి ఇంటికి ఆఅమ్మగారిని బాబా పంపారు. అక్కడ తలుపులు వేసి ఉన్నాయి అని ఆ అమ్మగారు అంటే ఇంకో ఇంటికి వెళ్ళమన్నారు అక్కడ కూడా తలుపులు వేసి ఉన్నాయి. వీడి జేబులో 105 రూ॥లు ఉన్నాయి కదా. బాబా 5రూ॥లు కోసం ఇంతమంది దగ్గరకు పంపుతున్నారు, తనజేబులో ఉన్న 5రూ॥లు తీసిఇవ్వవచ్చుకదా. అలా ఇవ్వటం మానివేసి బాబాగారితో నాకుపని ఉంది, తొందరగా వెళ్ళిపోవాలి, నాకు బ్రహ్మజ్ఞానం ఇచ్చేయండి

